

పుస్తకంతో మమేకం

ఉమ్మడి జిల్లా యువత పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. రాత్రి, పగలు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. 8లో▸



ప్రభుత్వ భూములు భద్రమేనా?

బెజ్జూర్‌లో ప్రభుత్వ భూములు యథేచ్ఛగా కబ్జా చేస్తున్నారు. తమ ఆధీనంలో ఉంచుకుని ఇతరులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
32.2 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. రుతు పవనాల ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

‘సర్కారు తీరు దారుణం’

సాక్షి, హైదరాబాద్: జైనూర్ ఘటనలో ఆటో డ్రైవర్ తనపై అత్యాచారం చేశాడని బాధితురాలు స్పష్టంగా ఆరోపిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం కప్పిపుచ్చేందుకు ప్రయత్నించడం దారుణమని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ మండిపడ్డారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో మాట్లాడారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుని, బాధితురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై చేసిన వ్యాఖ్యలకు మంత్రి సీతక్క క్షమాపణ చెప్పాలన్నారు. బీజేపీ మహిళా మోర్చా నాయకులు బాధితురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు. ఏజెన్సీలో డీఎస్సీ నిర్వహించాలని గత నెల 23న ధర్నా చేసిన వారిపై పోలీసులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం దోషులను రక్షించే ప్రయత్నం చేస్తోందని, బాధితులకు వెంటనే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

అందరూ సంయమనం పాటించాలి

ఉట్నూర్‌రూరల్: జైనూర్ ఘటనపై అందరూ సంయమనం పాటించాలని అదనపు డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఐజీ చంద్రశేఖర్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జగిత్యాల, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్ మహాజన్, గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, బాలానగర్ డీసీపీ సురేశ్ కుమార్‌లతో కలిసి ఆదివాసీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. అనంతరం డీజీ మాట్లాడుతూ మహిళపై దాడి బాధాకరమన్నారు. జైనూర్ మండలంలో జరిగిన ఘర్షణలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని, ఆస్తినష్టం జరిగిందని తెలిపారు. ఘర్షణ చోటు చేసుకున్న వెంటనే ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, రామగుండం, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల ప్రత్యేక బలగాలు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, ప్రత్యేక పోలీసు బలగాలతోపాటు పక్క జిల్లాల ఎస్పీలు జైనూర్ చేరుకున్నారని తెలిపారు. ఉట్నూర్‌లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించామని తెలిపారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించొద్దన్నారు.

అడుగడుగునా ఆంక్షలు..!

- పోలీసుల పహారాలో జైనూర్
- ఇరువర్గాల ఘర్షణల్లో రూ.కోట్లలో ఆస్తినష్టం
- ఘటనాస్థలికి చేరుకున్న రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి
- నలుగురు ఎస్పీలు, ప్రత్యేక బలగాలతో నిఘా
- ఇరువర్గాల పెద్దలతో వేర్వేరుగా అధికారుల సమావేశం
- సంయమనం పాటించాలని ఇరువర్గాలను కోరిన అదనపు డీజీ
- జిల్లా అంతటా ఇంటర్నెట్ సేవలు నిలిపివేత



జైనూర్‌లో ఓ వర్గం పెద్దలతో సమావేశమైన ఏడీజీ మహేశ్ భగవత్, కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, పోలీసు అధికారులు

సాక్షి, ఆసిఫాబాద్: ఇరువర్గాల ఘర్షణ, ప్రతీకార చర్యలతో భగ్గుమన్న జైనూర్ పరిస్థితి ఇప్పటికీ నివురుగప్పిన నిప్పులానే ఉంది. గురువారం పట్టణాన్ని పోలీసులు అష్టదిగ్బంధనం చేయడంతో కొంత ప్రశాంత వాతావరణం నెలకొన్నా.. ఎప్పుడేం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లా అంతటా ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం.. జైనూర్‌లో జరుగుతున్న పరిణామాలపై గోప్యత పాటించడం.. ఇతరులు రాకుండా అడ్డుకోవడం.. అడుగడుగునా ఆంక్షలు విధించడం వంటి పోలీసుల చర్యలతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఘటనాస్థలికి చేరుకున్న రాష్ట్ర అదనపు డీజీ(లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్ ఉదయమే పోలీసు ఉన్నతాధికారులతో సమీక్షించారు. మధ్యాహ్నం జైనూర్‌లో ఓ వర్గం మతపెద్దలతోపాటు ఆ తర్వాత ఉట్నూర్‌లోని కుమురంభీం కాంప్లెక్స్‌లో మరోవర్గం నేతలతో వేర్వేరుగా సమావేశం నిర్వహించారు. ఇరువర్గాల ప్రజలు సంయమనం పాటించాలని కోరడం ద్వారా ఉద్రిక్తతను కట్టడి చేసే ప్రయత్నం చేశారు. ఆస్తినష్టంపై పూర్తిస్థాయి నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించినట్లు తెలిపారు.



జైనూర్‌లో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

వెయ్యి మందికి పైగా పహారా..

జైనూర్‌లో బుధవారం హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంతో రాష్ట్ర డీజీపీ ఆదేశాలతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న శాంతిభద్రతల విభాగం అదనపు డీజీ మహేశ్ భగవత్, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి అల్లర్లను అదుపు చేసేందుకు చర్యలు చేపట్టారు. సిరిసిల్ల, ఆదిలాబాద్ ఎస్పీలు అఖిల్ మహాజన్, గౌస్ ఆలం, బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్ గురువారం జైనూర్‌కు చేరుకుని అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిఘా పెట్టారు. వెయ్యి మందికి పైగా ప్రత్యేక బలగాలతో పట్టణంలోని ప్రతీ షాపు వద్ద బందోబస్తు మోహరించారు. ఘటనా స్థలాల్లో పర్యటించి దెబ్బతిన్న ఇళ్లు, దగ్ధమైన షాపులను పరిశీలించారు. జైనూర్‌లో 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో స్థానికులు నిత్యావసరాలు అందుబాటులో లేవని అదనపు డీజీ మహేశ్ భగవత్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన పోలీసు వాహనాల్లో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ష్.. గప్‌చుప్..!

రాష్ట్ర పోలీసు బాస్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా పోలీసుల నుంచి జైనూర్‌లో జరుగుతున్న పరిణామాలపై మీడియా ప్రతినిధులు తెలుసుకునే ప్రయత్నం చేసినా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. మాట్లాడేందుకు ఎన్నిసార్లు ప్రయత్నించినా ఫోన్లు ఎత్తలేదు. పైగా జైనూర్‌కు ఆసిఫాబాద్ నుంచి వెళ్లిన ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ప్రతినిధులను ఊరి బయటే అడ్డుకుని వెనక్కి పంపించడం గమనార్హం. అక్కడి విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్త పడ్డారు. పౌరసంబంధాల అధికారితో ఇరువర్గాల మతపెద్దలతో సమావేశం జరిగినట్లు తెలుపుతూ ఒక ప్రకటన విడుదల చేయించారు.

జిల్లా ఎస్పీపై ఏడీజీ ఫైర్

సాక్షి, ఆసిఫాబాద్: పోలీసు ఉన్నతాధికారుల ఎదుటే బుధవారం జైనూర్‌లో హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడంపై శాంతిభద్రతల అదనపు డీజీ మహేశ్ భగవత్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్యపై తీవ్రస్థాయిలో మండిపడినట్లు సమాచారం. ఉదయం జైనూర్ చేరుకున్న అదనపు డీజీ కారు దిగిన మరుక్షణమే ఎస్పీపై ఫైర్ అయినట్లు తెలిసింది. ఇరువర్గాలు ఘర్షణకు దిగుతాయన్న సమాచారం ఉన్నా ఎందుకు పటిష్ట చర్యలు తీసుకోలేకపోయారని, ముందస్తుగా పోలీసులను అక్కడ ఎందుకు మోహరించలేదని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. డీఎస్పీ సదయ్య వివరణ చెప్పే ప్రయత్నం చేయగా.. అతడిని తన కళ్ల ముందు కనిపించొద్దని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో జిల్లా ఎస్పీతోపాటు డీఎస్పీలపై చర్యలు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇరువర్గాలతో నిర్వహించిన సమావేశాలకు సైతం ఎస్పీని దూరంగా ఉంచారు.

నిఘా వైఫల్యం.. భారీగా ఆస్తినష్టం

గతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో ఇక్కడి పరిస్థితులపై అవగాహన ఉన్న నిఘా విభాగం మహిళపై అత్యాచారయత్నం ఘటన వెలుగులోకి రాగానే జిల్లా పోలీసు ఉన్నతాధికారిని అప్రమత్తం చేయడంలో వైఫల్యం చెందింది. దీంతో జైనూర్‌లో బంద్ పిలుపు పేరిట హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ముందురోజు నిరసనలకు దిగిన బాధిత వర్గం మరుసటి రోజు వేల సంఖ్యలో పట్టణానికి చేరుకోవడాన్ని వారు పసిగట్టలేకపోవడం విమర్శలకు తావిస్తోంది. అదేవిధంగా ఇరువర్గాలు ఇళ్లు, దుకాణాలను తగలబెట్టేందుకు ఏకంగా 500 లీటర్ల పెట్రోలు, డీజిల్ వినియోగించారనే ప్రచారం నేపథ్యంలో ఆందోళనకారులు ముందస్తుగానే పక్కా ప్రణాళికలు రచించిన విషయాన్ని సైతం నిఘా విభాగం గుర్తించలేకపోయింది. ఇరువర్గాల ప్రతీకార చర్యల కారణంగా ఏకంగా రూ.70 కోట్ల వరకు ఆస్తినష్టం జరిగినట్లు అంచనా వేస్తున్నారు.



ఓ దుకాణంలో కాలిబూడిదైన సామగ్రి

ఇంటర్నెట్ బంద్‌తో ఇక్కట్లు

- జిల్లాలో నిలిచిన రేషన్ పంపిణీ
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తప్పని పాట్లు



కలెక్టరేట్‌లో ఒకేచోట ఓటరు జాబితా తయారు చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌అర్బన్: జైనూర్ ఘటన నేపథ్యంలో జిల్లాలో బుధవారం రాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలు నిలిపివేశారు. సోషల్‌మీడియాలో వదంతులు అదుపు చేసేందుకు అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. జిల్లా అంతటా వాట్సాప్, ఫేస్‌బుక్ ఇతర సోషల్ మీడియాపై నిఘా ఉంచారు. సమాచార వ్యవస్థ ఎక్కడికక్కడ స్తంభించిపోయింది. కేవలం బ్యాంకు, పోస్టాఫీసు, కలెక్టరేట్ సేవలు మాత్రమే కొనసాగాయి. ముఖ్యంగా నిరుపేదలకు ప్రతినెలా ఒకటి నుంచి అందించే రేషన్ సరుకులు ఈ- పాస్ విధానం ద్వారా పంపిణీ చేస్తున్నారు. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో రేషన్ సరుకుల పంపిణీ కూడా ఆగిపోయింది. జిల్లాలో ఇప్పటివరకు కేవలం 25 శాతం మాత్రమే రేషన్ సరుకులు పంపిణీ జరగగా.. మిగితా వారు సరుకుల కోసం నిరీక్షిస్తున్నారు.

ఉద్యోగులకు అవస్థలు

ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంటర్నెట్‌పై ఆధారపడి పనిచేసే వారు, ప్రైవేట్ ఉద్యోగులకు ఇబ్బందులు తప్పలేదు. పండుగ నేపథ్యంలో స్వగ్రామాలకు వచ్చిన వందలాది మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వర్క్‌ఫ్రమ్ హోం విధులు నిర్వర్తిస్తున్నారు. వీరంతా ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడంతో అయోమయంలో పడ్డారు. కొందరు బెల్లంపల్లి, మంచిర్యాలతోపాటు సమీపంలో మహారాష్ట్రకు వెళ్లి ముఖ్యమైన పనులు చేసుకున్నారు. మరికొందరు తిరిగి హైదరాబాద్‌కు కూడా వెళ్లినట్లు సమాచారం.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కాగజ్‌నగర్‌రూరల్: జైనూర్ ఘటనలో బాధితురాలిని ఆదుకోవాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. పట్టణంలోని తన నివాసం గురువారం మాట్లాడారు. హైదరాబాద్‌లో బాధితురాలిని జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పరామర్శించి అత్యాచారం జరగలేదని అనడం దారుణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ ఏర్పడి ఆస్తినష్టం జరిగిందన్నారు. ఘటన వివరాలు తెలుసుకునేందుకు వెళ్లకుండా తమను హౌస్ అరెస్టు చేసి నిర్బంధించారని తెలిపారు. బాధిత కుటుంబానికి రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతోపాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, శంకర్, వీరభద్రచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

‘మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం’

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసం గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జైనూర్‌లో బుధవారం జరిగిన ఘర్షణలో బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా.. ఎమ్మెల్యే అని చూడకుండా తనను అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. ఆమె వెంట మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

‘ఉత్తమ’ గురువులకు సత్కారం

ఆసిఫాబాద్‌రూరల్: సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. అనంతరం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 52 మందిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు విజ్ఞానాన్ని పంచుతూ వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. దేశ సంస్కృతిలో తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఇచ్చారని గుర్తు చేశారు. పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా జీవిత పాఠాలతో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఎస్‌వో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులతో డీఈవో అశోక్

ఉత్తములు వీరే..

టీచర్ పేరు	హోదా	పనిచేస్తున్న స్థానం
నానాజీ	హెచ్ఎం	గుండాయిపేట్(కౌటాల)
దుర్గప్రసాద్	ఎస్ఏ	జన్కాపూర్(ఆసిఫాబాద్)
మహపతిరావు	హెచ్ఎం	కాటేపల్లి(బెజ్జూర్)
నదీష్	హెచ్ఎం	చింతలమానెపల్లి
వామన్‌రావు	హెచ్ఎం	జైనూర్
కేశవ్	హెచ్ఎం	(కాగజ్‌నగర్)
విజయలక్ష్మి	హెచ్ఎం	కాగజ్‌నగర్
జ్యోతి	హెచ్ఎం	శిశుమందిర్(కాగజ్‌నగర్)
సమ్మయ్య	పీఎస్ హెచ్ఎం(ఎస్ఏ)	కెరమెరి
అజయ్‌కుమార్	పీఎస్ హెచ్ఎం	రింగన్‌ఘాట్(కెరమెరి)
రమేశ్	ఎస్ఏ	కౌటాల
నీలబిందు	ఎస్ఏ	కొత్తపల్లి(లింగపూర్)
రాకేశ్	ఎస్ఏ	చేడ్వాయి(పెంచికల్‌పేట్)
అశోక్‌చందర్	పీఎస్‌హెచ్ఎం	చేడ్వాయి(పెంచికల్‌పేట్)
ప్రభాకర్	ఎస్ఏ	వంకులం(రెబ్బెన)
ప్రకాశ్	ఎస్ఏ	వేంపల్లి(రెబ్బెన)
అమరేందర్‌రెడ్డి	ఎస్ఏ	తిర్యాణి
పాండురంగ	పీఎస్ హెచ్ఎం	తైవాడ(వాంకిడి)
అబ్దుల్ ఖలీల్	ప్రిన్సిపాల్	ఆసిఫాబాద్
వెంకటస్వామి	ప్రిన్సిపాల్	సిర్పూర్(యూ)
ప్రవీణ్	టీజీటీ	ఆసిఫాబాద్
నీరజ	ఎస్జీటీ	ఆసిఫాబాద్
విక్రమ్‌రావు	ఎస్జీటీ	చిర్రకుంట(ఆసిఫాబాద్)
హరిప్రకాశ్	ఎస్జీటీ	వాడిగూడ(ఆసిఫాబాద్)
సుభాశ్	ఎస్జీటీ	కొయ్యగూడ(బెజ్జూర్)
నీల	ఎస్జీటీ	నందికొండ(చింతలమానెపల్లి)
సుధాకర్	ఎస్జీటీ	ఇట్యాల(దహెగాం)
రాజమణి	ఎస్జీటీ	సార్సాల(కాగజ్‌నగర్)
కిషన్	ఎస్జీటీ	ఇంధన్‌ఘాట్(కెరమెరి)
అశోక్	ఎస్జీటీ	గుడ్లబోరి(కౌటాల)
కైలాస్	ఎస్జీటీ	గుడ్లబోరి(కౌటాల)
మహేశ్	ఎస్జీటీ	నంబాల(రెబ్బెన)
మాధవి	ఎస్జీటీ	సిర్పూర్(టి)
నిరంజన్ కుమార్	ఎస్జీటీ	సీతామ్‌గొంది(సిర్పూర్-టి)
జనార్దన్	ఎస్జీటీ	గడలపల్లి(తిర్యాణి)
సుశీల	ఎస్జీటీ	తేజ్‌గూడ(వాంకిడి)
లక్ష్మీప్రసన్న	సీఆర్‌టీ	కాగజ్‌నగర్
సురేఖ	సీఆర్‌టీ	జైనూర్
సనత్‌కుమార్	హెచ్ఎం	కాగజ్‌నగర్
మీనారెడ్డి	పీడీ	ఆసిఫాబాద్
కిరణ్ ఎస్ఏ	తిర్యాణి	
అచ్యుతనంద	ఎస్ఏ	పోచంలొద్ది(జైనూర్)
మల్లేశ్	ఎస్ఏ	సిర్పూర్(టి)
జగదీశ్వర్	ఎస్ఏ	ఆసిఫాబాద్
భువనేశ్వరి	ఎస్ఏ	పోచంలొద్ది(జైనూర్)
రాంబాయి	ఎస్ఏ	మాహగాం(కెరమెరి)
మధుసూదన్	ఎస్జీటీ	తుంగమడుగు
ప్రకాశ్	హెచ్ఎం	గోయగాం(కెరమెరి)
నటరాజ్	హెచ్ఎం	వాంకిడి
సునీత	హెచ్ఎం	చిన్నరాస్పెల్లి(దహెగాం)
జలపత్‌రావు	ఎస్ఏ	చిర్రకుంట(ఆసిఫాబాద్)
వినేశ్	హెచ్ఎం	వాంకిడి

ఆట కోసం అప్పు



రుణపడి ఉంటా

ప్రస్తుతం జూనియర్‌స్థాయి పోటీల్లో భారత జట్టుకు ఎంపికయ్యా. జోర్డాన్ దేశానికి వెళ్లడానికి కుటుంబసభ్యులతోపాటు కోచ్, అధ్యాపకులు అందించిన సహకారానికి రుణపడి ఉంటా. భవిష్యత్తులో సీనియర్‌స్థాయి పోటీలకు ఎంపిక కావడమే లక్ష్యం. మెరుగైన శిక్షణ కోసం ప్రభుత్వం, దాతలు సహకరించాలి.

– ఆదే తిరుపతి, హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు



హ్యాండ్‌బాల్ భారత జూనియర్ జట్టుతో తిరుపతి

- హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా యువకుడి ప్రతిభ
- జూనియర్‌స్థాయిలో భారత జట్టుకు ఎంపిక
- జోర్డాన్‌లో పదో ఏషియన్ జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ పోటీలు
- ప్రయాణ ఖర్చులకు అప్పు చేసిన క్రీడాకారుడి తండ్రి..
- ఆర్థిక తోడ్పాటునందించిన కోచ్, అధ్యాపకులు

కౌటాల(సిర్పూర్): వారిది నిరుపేద వ్యవసాయ కుటుంబం.. తల్లిదండ్రులకు క్రీడలపై పెద్దగా అవగాహన లేదు. తాము పడిన కష్టం బిడ్డలకు రావొద్దని బాగా చదువుకోవాలని ఎప్పుడూ చెబుతుండేవారు. చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకున్న వారి కుమారుడు హ్యాండ్ బాల్ పోటీల్లో సత్తా చాటుతున్నాడు. అయితే గ్రామీణ ప్రాంతానికి చెందిన యువ క్రీడాకారుడికి ప్రోత్సాహం కరువైంది.

గిరిజన జిల్లా నుంచి జోర్డాన్‌కు..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన ఆదే కేశవ్, నిర్మల దంపతులకు ముగ్గురు సంతానం. పెద్దకుమారుడు శంకర్ డిగ్రీ పూర్తి చేయగా, కుమార్తె హంస బీఎస్సీ పూర్తి చేసింది. చిన్నకుమారుడు తిరుపతికి పాఠశాల స్థాయి నుంచే హ్యాండ్‌బాల్ ఆటపై మక్కువ. ఆసిఫాబాద్ గురుకుల పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన అనంతరం ప్రస్తుతం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల హ్యాండ్‌బాల్ అకాడమీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇటీవల రాజస్తాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో నిర్వహించిన సెలక్షన్స్‌లో తెలంగాణ రాష్ట్రం తరుపున పాల్గొన్నారు. అక్కడ సత్తా చాటడంతో పదో ఏషియన్ జూనియర్ మెన్ హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్‌కు ఎంపికయ్యాడు. జోర్డన్‌లో జరిగే ఈ పోటీలకు మంగళవారం రాత్రి భారత జట్టుతో కలిసి బయలుదేరాడు.

వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు

పేద వ్యవసాయ కుటుంబానికి చెందిన తిరుపతిని ఆర్థిక కష్టాలు వెంటాడుతున్నాయి. జోర్డాన్ దేశంలో జరిగే పోటీలకు వెళ్లేందుకు ప్రయాణ ఖర్చులకు కూడా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి. క్రీడాకారులకు సంబంధించిన ఖర్చును సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు భరించాలి. కుమారుడిని ఎలాగైనా పోటీలకు పంపించాలని తిరుపతి తండ్రి కేశవ్ రూ.70 వేలు అప్పు తెచ్చాడు. అలాగే కోచ్ ప్రదీప్‌కుమార్ సైతం రూ.లక్ష సహకారం అందించారు. అధ్యాపకులు కొంత నగదును సమకూర్చి తిరుపతికి అందించి భారత జట్టుతో పంపించారు. మరింత నాణ్యమైన కోచింగ్ కోసం, ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సాయం అందించాలని తిరుపతి వేడుకుంటున్నాడు. గ్రామీణ క్రీడాకారుడికి ప్రభుత్వం సాయమందించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం ట్విటర్ (ఎక్స్)లో రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ట్యాగ్ చేస్తూ కోరారు.

సాయం చేయాల్సిన నంబర్లు

ఆదే శంకర్(తిరుపతి అన్నయ్య)
ఫోన్ పే, గూగుల్ పే నంబర్:
9640083952
బ్యాంకు వివరాలు :
ఆదే శంకర్ అకౌంట్ నంబరు :
37897482885
ఐఎఫ్ఎస్‌సీ కోడ్ : SBIN 0061739
బ్రాంచ్ : ఎస్‌బీఐ, కౌటాల

అప్పు చేసి ఇచ్చా



తిరుపతికి హ్యాండ్‌బాల్ ఆట అంటే చాలా ఇష్టం. భారత జట్టుకు ఎంపికయ్యాడని తెలిసి చాలా సంతోషపడ్డాం. కుమారుడిని భారత జట్టుతో పాటు పంపించాలని రూ.70 వేలు అప్పు చేసి ఇచ్చా. మిగతా కోచ్, అధ్యాపకులు ఇచ్చారు.

– ఆదే కేశవ్, క్రీడాకారుడి తండ్రి

క్లుప్తంగా

చెరువులో పడి యువకుడి మృతి


శ్రావణ్‌కుమార్ (ఫైల్)

కోటపల్లి: మండలంలోని రాజారం గ్రామానికి చెందిన తలాండి శ్రావణ్‌కుమార్ (27)చెరువులో పడి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తపల్లి గ్రామంలో బుధవారం బంధువులది సంవత్సరీకం కార్యక్రమానికి శ్రావణ్ వచ్చాడు. స్నానం చేయడానికి చెరువు వద్దకు వెళ్లగా లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు పడి గల్లంతయ్యాడు. గమనించిన తోటి బంధువులు కుటుంబసభ్యులు, పోలీసులకు అందించారు. వారు అక్కడికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టినా అచూకీ దొరకలేదు. గురువారం ఉదయం ఈతగాళ్లతో గాలించగా శ్రావణ్‌కుమార్ మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు ఎస్సై రాజేందర్ సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి అరెస్టు

బెల్లంపల్లిరూరల్(తాండూర్): ఇంటి పరసరాల్లో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..తాండూర్ మండలం తంగళ్లపల్లికి చెందిన కోయ గణేశ్ తన ఇంటి పరిసరాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నాడని అందిన సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. పెరటితోటలో తనిఖీ చేయగా నాలుగు గంజాయి మొక్కలు లభించాయని, వాటి విలువ రూ.40 వేలు ఉంటుందని ఎస్సై తెలిపారు. ఈమేరకు గణేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గంజాయి సాగు చేసినా, క్రయవిక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి సమాచారం తెలిస్తే సెల్ 8712656575 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు.

గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడి మృతి

రెబ్బెన(ఆసిఫాబాద్): గుర్తుతెలియని రైలు ఢీకొని వృద్ధుడి మృతిచెందినట్లు కాగజ్‌నగర్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ సురేశ్‌గౌడ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..గంగాపూర్‌కు చెందిన వశాకే శంకర్ (72) కూలీ పని చేసుకుని జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం పని నిమిత్తం రెబ్బెనకు వెళ్తున్నానని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి బయల్దేరాడు. మార్గమధ్యలోని మండలకేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ దాటుతుండగా గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. స్టేషన్ మాస్టర్ అందించిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. కాగా, మృతుడికి భార్య తానుబాయి, ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

దాడిచేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ ఎజాజ్ తన బావమరిది అయిన షేక్ మునాక్‌పై దాడి చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తరచూ తన ఇంటికి వస్తూ గొడవలకు దిగుతున్నట్లు తెలిపారు.



నిర్మల్‌లోని గ్రంథాలయంలో సన్నద్ధమవుతున్న యువత (ఫైల్)

పుస్తకంతో మమేకం

- సర్కారు కొలువే లక్ష్యం..
- గ్రూప్స్‌పై ఉమ్మడి జిల్లా యువత గురి
- గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ

నిర్మల్‌ఖిల్లా: సర్కారు కొలువే లక్ష్యంగా గ్రూప్స్ పోటీ పరీక్షలకు ఉమ్మడి జిల్లా యువత సిద్ధమవుతున్నారు. రాత్రి,పగలు గ్రంథాలయాల్లో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదల చేయడం, టీజీపీఎస్సీ..అక్టోబర్ 21 గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలు, నవంబర్, డిసెంబర్‌లో గ్రూప్–2 గ్రూప్–3 పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించింది. ఉన్న సమయానికి అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదువుతూ ప్రిపేరవుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పలు గ్రంథాలయాల్లో పలు పుస్తకాలు అందుబాటులో ఉంచారు. ఈ పోటీ పరీక్షలకు దాదాపు 50 వేలకు మందికి పైగా యువత సన్నద్ధమవుతున్నారు. దాదాపు 40 శాతం మందికిపైగా గ్రంథాలయాల్లో, అద్దెకు తీసుకున్న గదుల్లో ప్రిపేరవుతుండగా మరో 30 శాతం మంది హైదరాబాద్, వరంగల్ తదితర నగరాల్లో కోచింగ్ తీసుకుంటున్నారు. గత జూన్ 9న నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షను ఉమ్మడి జిల్లా నుంచి 15వేలకుపై అభ్యర్థులు రాశారు. ఇందులో అర్హత సాధించినవారికి వచ్చే అక్టోబర్‌లో మెయిన్స్ పరీక్షలకు హాజరుకానున్నారు. గ్రూప్–1తోపాటు గ్రూప్–2, గ్రూప్–3 పరీక్షలు నిర్వహించనుండడంతో తదనగుణంగా ప్రిపేరవుతున్నారు.

జాబ్ కాలెండర్ ప్రకటనతో ఉత్సాహం..
రాష్ట్ర ప్రభుత్వం జాబ్ కాలెండర్ విడుదలతో నిరుద్యోగుల్లో ఉత్సాహం నెలకొంది. నిర్ణీత గడువులోనే ఉద్యోగ నియామక ప్రక్రియ పూర్తికానున్నట్లు వారి నుంచి ఆశాభావం వ్యక్తమవుతోంది. పరీక్ష నిర్వహణ తేదీలు ప్రకటించడంతో ప్రణాళిక బద్ధంగా ప్రిపేర్ అవుతున్నారు. వరుస పోటీ పరీక్షల నేపథ్యంలో కోరుకున్న కొలువు సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. ఇందుకు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే మెటీరియల్, పుస్తకాలను అందుబాటులో ఉంచడంతో వాటిని వినియోగించుకుంటున్నారు.

గురిపెడితే కొలువు సులువే..
నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల కేంద్ర గ్రంథాలయాలతో పాటు బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళు నిరుద్యోగుల కోసం దోహదపడుతున్నాయి. ఇందులో ఉద్యోగాలకు శిక్షణ పొందుతూ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. ప్రస్తుతం కష్టపడితే ఉద్యోగ సాధన తర్వాత భవిష్యత్ బాగుంటుందని, ప్రభుత్వ కొలువుల్లో ఎలాగైనా సాధించాలని తపనతో శ్రమిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా సిద్ధమైతే పోటీ పరీక్షల్లో నెగ్గి సర్కారు కొలువు సాధించడం కష్టమేమీ కాదని గత విజేతలు పేర్కొంటున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



పోటీ పరీక్షలకు అనుగుణంగా ప్రణాళికా బద్ధంగా చదవాలి. సిలబస్ ఆధారిత ప్రిపరేషన్ అవసరం. సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి. తెలంగాణ ఉద్యమం, చరిత్ర, దేశ, రాష్ట్ర భౌగోళిక స్వరూపాలు, పర్యావరణం సైన్స్ అండ్ టెక్నాలజీ, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలను ప్రాధాన్యతనిచ్చి చదవాలి.
– రమణాగౌడ్ గొడిసెల, పోటీ పరీక్షల నిపుణుడు

ఒత్తిడికి గురికావొద్దు



పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న తరుణంలో మానసికంగా ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుంది. ఆందోళన, భయం లేకుండా ప్రశాంతంగా చదవాలి. మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ప్రిపరేషన్ కొనసాగించాలి. లక్ష్యంపై దృష్టిసారించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.
– వెల్మల మధు, అసోసియేట్ ప్రొఫెసర్, నిర్మల్

ఏజెన్సీలో అలజడి!

- పరిస్థితిని ముందే అంచనా వేయలేదా?
- దాడుల తర్వాత తేరుకున్న వైనం..

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: మహిళపై దాడి ఘటన చినికి చినికి గాలివానగా మారి రెండు ప్రధాన వర్గాల్లో దాడులు చేసే స్థాయికి చేరింది. పచ్చని అడవుల్లో ప్రశాంత జీవనానికి మారుపేరుగా ఉండే గూడేల్లో ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ ఘటనతో శాంతిభద్రతలు చక్కబెట్టేందుకు ఉమ్మడి జిల్లా పోలీసు యంత్రాంగం, ఇతర జిల్లాల ప్రత్యేక బలగాలను మొహరించాల్సి వచ్చింది. చివరికి రాష్ట్ర అడిషనల్ డీజీ(లా అండ్ ఆర్డర్) రంగంలోకి దిగాల్సి వచ్చింది. ఇరువర్గాల మధ్య సున్నితమైన అంశం కావడంతో అధికారులు, పోలీసు యంత్రాంగం మరింత అప్రమత్తంతో వ్యవహరించాల్సి వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు ఎస్పీలు, ఓ డీసీపీతోపాటు మరో ఇద్దరు ఎస్పీలు, ఓ డీసీపీ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. సమన్వయం పాటించేందుకు ఇరువర్గాలతో చర్చించారు. ఆంక్షలు అమలు చేస్తూ ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉంటున్నారు. వ్యాపారాలు నిర్వహిస్తున్న మరోవర్గం ఆస్తులపైనా దాడులు జరిగాయి. ఈ పరిస్థితిని పోలీసు యంత్రాంగం ముందే అంచనా వేయలేకపోయిందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఏజెన్సీలో జరిగిన ఘటనలు గుర్తున్న పోలీసు అధికారులెవరైనా ముందస్తు చర్యలు తీసుకుంటారు. కానీ మరోసారి పరిస్థితి చేయిదాటే వరకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారు. బాధిత మహిళపై దాడి జరిగిన మూడు రోజుల వరకు రోడ్డు ప్రమాదంగానే భావిస్తూ, వాస్తవ పరిస్థితిని తెలుసుకోలేకపోయారా..? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. పోలీసు యంత్రాంగం మాత్రం వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టినట్లు చెబుతున్నారు.

ప్రశాంత అడవిలో..
ఏజెన్సీలో జరిగిన పలు ఘటనలు పోలీసులకు సవాల్‌గా మారాయి. శాంతిభద్రతలు నెలకొలడంలో సమస్యలు తెచ్చాయి. 2017లో ఆదివాసీ, లంబాడా వివాదంలో ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్‌పై దాడి చేసి, కలెక్టర్ కారు అద్దాలు, ఆఫీసులో ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఉట్నూరు, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలోనూ నిరసనలు జరిగాయి. ఆ కేసుల్లో పలువురు ఆదివాసీలపై కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనపై సీరియస్‌గా తీసుకున్న అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల ఎస్పీలను బదిలీ చేసింది. ఏజెన్సీలో పరిస్థితిని చక్కబెట్టడంలో విఫలమయ్యారనే కారణంగా ఆ స్థానాల్లో కొత్త అధికారులను నియమించింది. మరోవైపు ఉమ్మడి జిల్లాలో ఏజెన్సీలో మొదలై వివాదం ఇతర జిల్లాలకు వ్యాప్తి చెందడంతో పరిస్థితి అదుపులోకి వచ్చేందుకు నెలల సమయం పట్టింది. ఆ సమయంలోనూ ఇంటర్నెట్ నిషేధంతోపాటు అనేక ఆంక్షలు అమలయ్యాయి.

- 2019లో ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం ఎల్లాపటార్‌లో ఓ దళిత మహిళను ముగ్గురు వ్యక్తులు దారుణంగా అత్యాచారం చేసి చంపేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కుదిపేసింది. అప్పట్లో ఈ ఘటనపై జైనూరు కేంద్రంగానే స్థానికులు పెద్దఎత్తున ధర్నాలు, నిరసనలు చేపట్టారు. దీంతో ప్రత్యేక కోర్టులో విచారణ జరగగా నిందితులకు ఉరి శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. కొద్దిరోజులకు గొడవ సద్దుమణిగింది.

అంచనా వేయలేదా?
గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఏజెన్సీలో పరిస్థితి ఎప్పటికప్పుడు చేయిదాటకుండా చూస్తున్నారు. ఆయా సంఘాల, నాయకులు ధర్నాలు, నిరసనలు, బంద్‌లకు పిలుపునిస్తే నిఘా వ్యవస్థతో సమాచారం తీసుకుని ఆదిలోనే నిలిపివేస్తున్నారు. వీటితోపాటు పాలన పరంగా మార్పులు తెచ్చారు. ఏజెన్సీలో 'పెసా' చట్టాన్ని అమలుకు ప్రజాప్రతినిధులు, అధికారులు కృషి చేస్తున్నారు. పోలీసులు ఆదివాసీలకు మరింత దగ్గరవుతున్నారు. స్థానికంగా జరిగే సమస్యలు, అభివృద్ధిపైనా తమ ఇబ్బందులను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. ఆదివాసీ గూడెల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. విద్య, వైద్యం, యువతకు ఉపాధి, తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అయితే తాజాగా జరుగుతున్న ఘటనల్లో మాత్రం ముందస్తుగా అంచనా వేయడంలో యంత్రాంగం విఫలమైందనే విమర్శలు వస్తున్నాయి.

వేతన ఒప్పందాలు అమలు చేయాలి

- బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


గని మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న సత్తయ్య

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందంలో చేసుకున్న ఒప్పందాలను సింగరేణిలో పూర్తిస్థాయిలో అమలు చేయాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. వేతన ఒప్పందాలు అమలు చేయకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారన్నారు. సింగరేణి కార్మికులకు కోలిండియాలో మాదిరిగా క్యాడర్ స్కీంను అమలు చేయాలన్నారు. మహిళా కార్మికులకు సామాజిక భద్రత, సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్పొరేట్ ఆసుపత్రిని ఏర్పాటు చేసి కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. యూనియన్ సభ్యత్వాలను ధ్రువీకరిస్తూ చెక్ సిస్టం నెలకొల్పి పారిశ్రామిక వివాదాల చట్టాన్ని అమలు చేయాలన్నారు. సింగరేణిలో కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ సాధించిన లాభాలను ప్రకటించి అందులో నుంచి కార్మికులకు 40 శాతం వాటాను పంపిణీ చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కోలిండియాలో ఇస్తున్నట్లుగా హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగ భద్రత, సంక్షేమం, పీఎల్ఆర్ బోనస్ తదితర అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు మాదాసి రవీందర్, గూడా శ్రీకాంత్, బోయిన మల్లేశ్, కట్కూరి సతీశ్, పగిడి శ్రీకాంత్, రాజేందర్ విజయ్, మహేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై చర్య తీసుకోవాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్‌లో ఓబీ పనులు చేసే సీఆర్ఆర్‌సంస్థ కాంట్రాక్టర్‌పై యాజమాన్యం చర్య తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. బ్లాస్టింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు మస్టర్లు ఇవ్వకుండా ఇతర పనులు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్నారని, ప్రశ్నిస్తే కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిపై తాము ఇదివరకే ఓసీపీ ప్రాజెక్టు అధికారికి ఫిర్యాదు చేయినా పట్టించుకోలేదన్నారు. యాజమాన్యం స్పందించి ప్రతినెల 26 మస్టర్లు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని మాట వినకుంటే సదరు కాంట్రాక్టుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

9న ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం న్యూలోలంలో గల లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో ఈనెల 9న ఉమ్మడి జిల్లాస్థాయి బాల,బాలికల సబ్ జూనియర్ ఖోఖో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంద్రత్ ఈశ్వర్, ఎస్.శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ఈ పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ఆధార్‌కార్డు, బోనాఫైడ్ సర్టిఫికెట్లతో హెచ్‌ఎం సురేశ్‌కుమార్, పీఈటీ రాకేశ్‌లకు రిపోర్టు చేయాలని సూచించారు. పోటీల్లో విజేతలకు ఈనెల 13 నుంచి 15 వరకు ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

28న పంచాయతీల్లో ఫొటో ఓటరు తుది జాబితా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 28న తుది ఫొటో ఓటరు జాబితా సిద్ధం చేసి పంచాయతీల్లో ప్రదర్శించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారథి తాజాగా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13న ఫొటో ఓటరు జాబితా సిద్ధం చేయాలని, 18న అన్ని పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో సమావేశం, 19న ఎంపీడీఓల ఆధ్వర్యంలో ఎంపీఓ, కార్యదర్శులతో మండల స్థాయిలో సమావేశాలు, 14 నుంచి 21వరకు పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలు, అభ్యంతరాల స్వీకరణ, 26న ఓటరు జాబితాలపై అభ్యంతరాల పరిష్కారం, 28న తేది ఫొటో ఓటరు జాబితాల ప్రదర్శన చేయాలని ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది.

8న ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ సదస్సు

పాతమంచిర్యాల: పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈనెల 8న ఐఎఫ్‌టీయూ ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్ భవన్‌లో కార్మిక సంఘాల నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. కార్మికులు ఈ సదస్సుకు తరలిరావాలని కోరారు. సభ్యులు సురేందర్, మల్లన్న,సారయ్య,సాంబన్న రాజేశం, అరుణ పాల్గొన్నారు.

దాడి కేసులో ఇద్దరికి జరిమానా

దండేపల్లి: భూతగాదా విషయంలో ఒకరిపై దాడికి పాల్పడిన ఇద్దరికి జరిమానా విధిస్తూ మంచిర్యాల అడిషనల్ సబ్‌కోర్టు జడ్జి అర్పిత మారంరెడ్డి గురువారం తీర్పునిచ్చారు. దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం.. 2021 ఆగస్టు 29న దండేపల్లి మండలం పెద్దపేటకు చెందిన బొడ్డు రాజన్నను అదే గ్రామానికి చెందిన రవీందర్, హరికృష్ణలు భూతగాదాల విషయంలో కర్రలతో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై శ్రీకాంత్ కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ చేశారు. కేసు విచారణ గురువారం పూర్తి కావడంతో, నిందితులిద్దరికి ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి ఈ మేరకు తీర్పు ఇచ్చారని ఎస్సై పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడురోజుల జైలు

జైపూర్: డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ చెన్నూర్ సివిల్ కోర్టు జడ్జి రవి తీర్పునిచ్చారని జైపూర్ ఎస్సై శ్రీధర్ తెలిపారు. గురువారం జైపూర్‌లో పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రంకెన్ డ్రైవ్‌పరీక్షలు నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాన్సాయిపేట గ్రామానికి చెందిన మెరుగు వెంకటేశ్‌కు డ్రంకెన్ డ్రైవ్ పరీక్ష చేయగా మద్యం తాగినట్లు తేలింది. ఈ మేరకు కేసు నమోదు కేసుకున్నారు. అనంతరం చెన్నూర్ కోర్టులో వెంకటేశ్‌ను హాజరుపర్చగా జడ్జి ఈ మేరకు తీర్పునిచ్చారని ఎస్సై శ్రీధర్ తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి


వివరాలు నమోదు చేస్తున్న ఎస్సై సురేశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారిపడి గాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై గోపతి సురేశ్ కథనం మేరకు.. హాజీపూర్ మండలం దొనబండకు చెందిన మోతె సుధాకర్(48) బుధవారం ఉదయం నిద్ర లేచి బయటకు వస్తుండగా ప్రమాదవశాత్తు మెట్లపై నుంచి జారి కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్టు


పట్టుబడిన దొంగలు, బైక్‌లతో సీఐ బన్సీలాల్, సిబ్బంది

మంచిర్యాలక్రైం: జిల్లాలోని పలు ఏరియాల్లో బైక్‌లు దొంగిలించి విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల సీఐ బన్సీలాల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని ఐబీ చౌరస్తా వద్ద ఎస్సైలు సనత్, సురేశ్ సిబ్బందితో కలిసి గురువారం వాహనాలు తనిఖీ చేపట్టారు. నిమ్మల కుమార్, నెల్లి సాయికుమార్‌లు ధ్రువపత్రాలు లేని బైక్‌లు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని విచారించగా మంచిర్యాల, లక్సెట్టిపేట, కాసిపేటలో పలు బైకులు దొంగిలించామని ఒప్పుకున్నారు. వారి వద్ద ఉన్న రెండు బైక్‌లతోపాటు చున్నంబట్టిలో ఓ ఇంట్లో దాచిన మరో నాలుగు బైకులు స్వాధీనం చేసుకుని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కానిస్టేబుళ్లు సుబ్బారావు, శ్రీనివాస్, రమేశ్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధ శతాబ్దం.. అ'పూర్వ' సమ్మేళనం


చెన్నూర్‌లో సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

- 54 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి మిత్రులు
- ఏడు పదులు దాటిన పూర్వ విద్యార్థుల హాజరు

చెన్నూర్: అర్ధ శతాబ్దం క్రితం వారంతా ఒకే తరగతి గదిలో కలిసి చదువుకున్నారు. ఆ తర్వాత ఎవరి ఉన్నత విద్యవైపు అడుగులు వేస్తూ వేరయ్యారు. వీరిలో కొందరు వైద్యులుగా, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. 54ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి మంచిర్యాల జిల్లా చెన్నూర్ వేదికైంది. చెన్నూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1970–71విద్యాసంవత్సరం చదివిన విద్యార్థుల సమ్మేళనం గురువారం స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల్లో వైద్యులు, ఉపాధ్యాయులు, వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తూ స్థిరపడిన పూర్వ విద్యార్థులంతా హాజరయ్యారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వారణాసి చంద్రయ్య, పులి రామన్న, బోడ్ చంద్రయ్య, అడ్వాల లచ్చయ్య, సయ్యద్ సాధిక్ అలీలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పురాణం శంకర్, టంకసాల రవీందర్, రుద్రభట్ల రంజన్, మహావాది రమేశ్, గన్ను పురుషోత్తం, గన్ను శ్రీరాములు, డాక్టర్ సుడిగాల రవీంద్రనాథ్ సూరి, కసోజ్జుల కమలాకర్, నాగోతు సత్యనారాయణ, రాజేశ్వరిరెడ్డి, లింగయ్యతోపాటు మరో 40 మంది పాల్గొన్నారు.

జోరుగా 'చికున్ గున్యా'

- ఆసుపత్రిలో జ్వరపీడితులు
- బెడ్‌కు ఇద్దరు చొప్పున వైద్యసేవలు


చికిత్స పొందుతున్న రోగులు

చెన్నూర్: చికున్ గున్యా జ్వరాలు జోరందుకున్నాయి. చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం జ్వరపీడితులతో కిటకిటలాడుతుంది. 100 పడకలు నిండడంతో మరో 15 పడకలు రిపేర్లు చేయించి సమకూర్చారు. అయినా పడకలు పరిపోకపోవడంతో ఒక్కో బెడ్‌కు ఇద్దరు రోగులను ఉంచి సెలైన్లు ఎక్కించాల్సిన దుస్థితి నెలకొంది. గురువారం 300లకు పైగా రోగులు వివిధ పరీక్షలు చేయించుకోగా, 100 మందికి పైగా జ్వరాలతో బాధపడుతూ చికిత్సలు పొందుతున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డి.సత్యనారాయణ మాట్లాడుతూ రోజురోజుకు జ్వర పీడితులు పెరుగుతున్నారన్నారు. ఒకే కుటుంబంలో ఇద్దరు జ్వరాలతో బాధపడుతుంటే ఒకే బెడ్ ఇచ్చి వైద్యం చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా 'సర్వేపల్లి' జయంతి


నివాళులు అర్పిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో గురువారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, శ్రీపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల


ఎల్లంపల్లి గేట్ల ఎత్తివేతతో గోదావరిలోకి భారీగా చేరుతున్న వరదనీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద ఉధృతి తగ్గింది. కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి వస్తున్న వరదనీటితోపాటు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరుతోంది. గురువారం గుడిపేట శివారులోని గోదావరిపై ఉన్న ప్రాజెక్ట్ నీటిమట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్‌కు గాను 145.60 మీటర్లు ఉండగా మొత్తం 20.175 టీఎంసీలకు గాను 16.100 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ఎల్లంపల్లికి ఇన్‌ఫ్లో ద్వారా 1.70 లక్షల క్యూసెక్కులు, ఎస్సారెస్పీ నుంచి 25 వేల క్యూసెక్కులు, కడెం నుంచి 4 వేల క్యూసెక్కుల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో కలుస్తోంది. ఔట్‌ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 316 క్యూసెక్కుల నీటిని తరలిస్తుండగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లోని 32 గేట్లు తెరిచి 1.65 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.